ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 4 నవంబరు 2024

స్వస్థలాలకు తిరిగి వస్తున్న జనం

రహదారుల్లో ట్రాఫిక్ జాం



కిలాబాక్కం బస్‌టెర్మినల్ వద్ద గుమికూడిన ప్రయాణికులు



తాంబరం రహదారిలో నిలిచిన వాహనాలు

రిటర్న్ జర్నీ ఎఫెక్ట్

- కిటకిటలాడుతున్న రైళ్ళు, బస్సులు
- టోల్‌గేట్ల వద్ద బారులు తీరిన వాహనాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసులు

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కోసం సొంతూర్లకు వెళ్ళిన నగర వాసులు తిరిగి వస్తున్నారు. దీంతో బస్సులు, రైళ్ళు కిక్కిరిసిపోయాయి. నగరానికి తిరిగి వస్తున్న వాహనాల కారణంగా నగర శివారు ప్రాంతంలోని టోల్‌ప్లాజాల్లో వాహనాలు బారులు తీరాయి. దీంతో టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. అక్టోబరు 31న దేశ వ్యాప్తంగా దీపావళి పండుగ కోసం నగరం నుంచి అనేక మంది తమ సొంతూర్లకు వెళ్ళారు. నాలుగు రోజుల సెలువులు ముగియడంతో పండుగ కోసం స్వస్థలాలకు వెళ్ళిన నగర వాసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి వస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, రైళ్ళు కిక్కిరిసి పోయి వస్తున్నాయి. కార్లలో వెళ్ళినవారు కూడా తిరిగి వస్తుండడంతో టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులుతీరాయి. పరనూరులోని టోల్ ప్లాజాలో టోల్ చార్జీలను వసూలు చేసేందుకు అదనంగా మరో రెండు లైన్లలో కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి ఒక్కసారిగా వేలాది వాహనాలు వస్తుండటంతో సింగపెరుమాళ్ కోయిల్, మరైమలై నగర్, గూడువాంజేరి, కిలాంబాక్కం, పెరుంగళత్తూరు, తాంబరం ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్య సోమవారం ఉదయం వరకు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అదే సమయంలో వాహనాల రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.

నీట్ రద్దు.. మద్యనిషేధం అమలు!

- టీవీకే కార్యనిర్వాహక మండలిలో 26 తీర్మానాలు



సమావేశంలో తీర్మానాలను చదువుతున్న టీవీకే నేత విజయ్

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నిరుపేద విద్యార్థులను వైద్య కోర్సులకు దూరం చేసే నీట్ రద్దు చేయాలని, మద్యం దుకాణాలను దశలవారీగా మూసి వేసి సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని, జమిలి ఎన్నికల నిర్వహణ ప్రయత్నాలను ఖండిస్తూ తమిళగ వెట్రి కళగం సమావేశంలో తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించింది. ఆదివారం పనయూరులోని టీవీకే ప్రధాన కార్యాలయంలో టీవీకే కార్యనిర్వాహక మండలి సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ నేతృత్వంలో జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితర నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో చేసిన 26 తీర్మానాలను ఆమోదించారు. ఇదే విధంగా విక్రవాండిలో పార్టీ తొలి మహానాడు విజయవంతం కావడానికి పాటుపడిన పార్టీ ప్రముఖులు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు ప్రకటిస్తూ, రాష్ట్రంలో అన్ని మతాలవారి మధ్య సామరస్యత నెలకొల్పటమే పార్టీ ఆశయమని, మహిళలకు భద్రత కల్పించే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతూ తీర్మానాలను ఈ సమావేశంలో ఆమోదించారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు

రాష్ట్ర ప్రభుత్వమే జనగణన జరపాలి..

రాష్ట్రంలో కులాలవారీగా జనగణను నడపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానాన్ని కూడా టీవీకే నాయకులు ప్రతిపాదించారు. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కలిగించాలని విద్యను ఉమ్మడి జాబితాలో నుండి తొలగించి రాష్ట్ర జాబితాకు మార్చాలని మరో తీర్మానంలో తెలిపారు.

సంపూర్ణ మద్యనిషేధం..

రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని కోరుతూ ఈ సమావేశంలో తీర్మానం ప్రతిపాదించారు. మహిళలకు ప్రతినెలా రూ.1000లు ఇతర కానుకలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల సంఖ్య పెంచి అమ్మకాలను పెంచడం గర్హనీయమని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

పరందూరు ఎయిర్‌పోర్ట్‌కు నిరసన...

కాంచీపురం జిల్లా పరందూరులో కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రయత్నాలను ఖండిస్తూ మరొక తీర్మానం కూడా చేశారు. ఎన్నెల్సీలోని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కూడా ప్రతిపాదించారు. కోయంబత్తూరులో మెట్రోరైలు ప్రాజెక్టు పనులను త్వరితగతిన అమలు చేయాలని మరొక తీర్మానం చేశారు.



పనయూరు రోడ్డులో టీవీకే జెండాలు, బనియన్లు అమ్ముతున్న వ్యాపారి

జాలర్లకు శాశ్వత పరిష్కారం..

శ్రీలంక నావికాదళం అక్రమ నిర్బంధం నుంచి తమిళ జాలర్లను కాపాడే దిశగా శాశ్వత పరిష్కారమార్గాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం చేశారు. ఆ తీర్మానంలో కచ్చాదీవికి విముక్తి కలిగించి, ఆ దీవిని భారత భూభాగంలో చేర్చాలని కూడా కోరారు. శ్రీలంకకు సంబంధించిన విదేశీ వ్యవహారాలను రాష్ట్ర ప్రభుత్వ సూచనల ప్రకారం నిర్వర్తించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

ద్విభాషా విధానానికే మద్దతు..

రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లో త్రిభాషా విధానాన్ని అమలు చేయకూడదని, ఇప్పటిలాగే ద్విభాషా విధానాన్నే కొనసాగించాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండకూడదంటూ సమావేశంలో తీర్మానాన్ని ప్రతిపాదించి ఆమోదించారు. హిందీ వ్యతిరేకోద్యమంలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పిస్తున్నట్లు కూడా తీర్మానంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను మెరుగుపరిచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానం చేశారు.

చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్..

రాజధాని నగరం చెన్నైలో సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ సమావేశంలో కీలకమైన తీర్మానం చేశారు. ఆ డివిజన్ బెంచ్‌లో కేసులపై ఇరుపక్షాల వాదనలను న్యాయమూర్తులు అర్థం చేసుకునేందుకు వీలుగా తప్పనిసరిగా తమిళం తెలిసిన న్యాయమూర్తిని కూడా నియమించుకోవాలని తీర్మానంలో పేర్కొన్నారు. చెన్నైలో చేర, చోళ, పాండ్య రాజుల చారిత్రక అంశాలన్నీ నేటి తరానికి తెలిసేలా ఓ మ్యూజియం ఏర్పాటు చేయాలని మరొక తీర్మానం చేశారు. సమరయోధుల పేర్లను బస్‌స్టేషన్‌లు, ఉద్యానవనాలకు పెట్టాలని ఈ తీర్మానంలో సూచించారు. ముస్లిం నేత కాయిదేమిల్లత్ పేరిట సేవాభావాలు కలిగిన ముస్లిం మహిళకు అవార్డు, నగదు కానుక అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా తమిళ సేవకులకు తగైసాల్ తమిళర్ అవార్డు ప్రదానం చేయడాన్ని హర్షిస్తూ మరొక తీర్మానం చేశారు. తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలో రాకెట్ ప్రయోగ కేంద్రం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. ఇటీవల విక్రవాండిలో జరిపిన పార్టీ తొలిమహానాడు సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన పార్టీ శ్రేణులకు నివాళులర్పిస్తూ చివరి తీర్మానం ప్రతిపాదించి ఆమోదించారు.

విమర్శలు పట్టించుకోవద్దు

- పార్టీ శ్రేణులకు విజయ్ హితవు

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీపై పసలేని విమర్శలు చేసే నాయకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, అదే సమయంలో రాజకీయ ప్రధాన ప్రత్యర్థులు చేసే విమర్శలపై తొందరపాటుగా ప్రతివిమర్శలు చేయకుండా ఆచితూచి వ్యహరించి బదులివ్వాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకుడు, నటుడు విజయ్ పార్టీ శ్రేణులకు హితవు పలికారు. ఆదివారం ఉదయం జరిగిన పార్టీ కార్యనిర్వాహక మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యవహారాలకు సంబంధించి సామాజిక ప్రసార మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితులతోనూ వ్యక్తిగత విమర్శలకు పాల్పడకూడదంటూ హెచ్చరించారు. ఓట్లు రాబట్టేందుకు కృషి చేసే కార్యకర్తల సేవలను ఆయా జిల్లా శాఖల నాయకులు గుర్తించి వారిని ప్రోత్సహించాలని, అధిష్టానానికి వారి సేవలను తరచూ తెలియజేయాలన్నారు. పార్టీ బహిరంగ సమావేశాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని, సభలకు అనుమతి రాకుంటే తక్షణమే పార్టీ అధిష్టానవర్గానికి తెలియజేయాలని విజయ్ పేర్కొన్నారు.

త్వరలో టీవీ ఛానెల్..

ఇదిలా ఉండగా తమిళగ వెట్రి కళగం పార్టీ సమాచారం ప్రజలకు సకాలంలో చేరాలంటే పార్టీకంటూ ప్రత్యేకంగా ఓ టీవీ ఛానెల్ ప్రారంభించాలని పలువురు నాయకులు విజయ్‌కి సూచించారు. తనకూ అదే ఆలోచన ఉందని, వీలైనంత త్వరగా టీవీ ఛానెల్ ప్రారంభిస్తామని చెప్పారు. ఇక అసెంబ్లీ ఎన్నికలకు ముందే వచ్చే యేడాదిలోగా ప్రతి పోలింగ్ కేంద్రానికి 10 మందిని పార్టీ తరపు ఇన్‌చార్జులను నియమించాలని జిల్లా శాఖ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. ఇక విజయ్ డిసెంబర్ 27నుండి జిల్లాల వారీగా రాష్ట్ర పర్యటన చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

పది జిల్లాలకు వర్ష సూచన

- వాతావరణ శాఖ హెచ్చరిక

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తమిళనాడు కోస్తా తీరం ప్రాంతం సహా పరిసర ప్రాంతాలపై బాహ్య ఉపరితల ఆవర్తనం నెలకొనడంతో ఈ నెల 8 వరకు 10 జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇటీవల మదురై, తిరుప్పూరు, నీలగిరి, కన్నియాకుమారి జిల్లాల్లో కుండపోత వర్షాలు కురవటంతో ఆ మూడు జిల్లాల్లోని నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడే అవకాశాలు ఉండటంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా రాష్ట్రంలోని కన్నియాకుమారి, తిరునెల్వేలి, తూత్తుక్కుడి, తెన్‌కాశి, తేని, దిండుగల్, మదురై, విరుదునగర్, శివగంగై, రామనాథపురం జిల్లాల్లో ఈ నెల 8వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. రాగల 24 గంటల్లో రాజధాని చెన్నై నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే శనివారం రాత్రి నుంచి రాష్ట్రంలో కన్నియాకుమారి, నెల్లై, తెన్‌కాశి, కోయంబత్తూరు, ఈరోడ్, నీలగిరి, తేని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో గత 24 గంటల్లో గరిష్ఠంగా కన్నియాకుమారి జిల్లా కొట్టారంలో 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కోత్తగిరిలో 14.3 సెంమీ, ఆలంకరై ఎస్టేట్‌లో 13.7 సెంమీ, కుమరిలో 13 సెంమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

2026 ఎలక్షన్స్..

వారసత్వ రాజకీయాలకు చరమగీతం

- ఈపీఎస్ శపథం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే వారసత్వ రాజకీయాలకు తమ పార్టీ చరమగీతం పాడుతుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి శపథం చేశారు.. సేలం జిల్లా ఎడప్పాడి నియోజకవర్గ పరిధిలోని వీరప్పంపాళయంలో ఆదివారం జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఈపీఎస్ ప్రసంగించారు. సేలం జిల్లాలో మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ జిల్లాలోని 8 నియోజకవర్గాలను అన్నాడీఎంకే కైవసం చేసుకుందని, మిగతా రెండు నియోజకవర్గాల్లో మిత్రపక్షాలకు చెందిన అభ్యర్థులు విజయం సాధించారని, దీన్ని బట్టి జిల్లాలో పార్టీ బలం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా మరింత పెరిగే అవకాశముందని, ఈసారి అత్యధిక మెజార్టీ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నిర్వాహకులు ఇప్పటినుంచే కృషిచేయాలని సూచించారు. అధికార డీఎంకేలో పార్టీ కోసం శ్రమించిన వారికి గౌరవం లేదని, ఆ పార్టీలో ప్రజాస్వామ్యం కనిపించదన్నారు. ఆరంభం నుంచి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన నాయకులు, ముఖ్యంగా మీస చట్టంలో జైలుకెళ్లిన వారు, సీనియర్లకు గుర్తింపు లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి కుటుంబంలో జన్మించిన స్టాలిన్‌కు పార్టీ పగ్గాలతో పాటు సీఎం పదవి కట్టబెట్టారని, స్టాలిన్ కుమారుడు ఉదయనిధిని ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా నియమించడం సర్వాధికారం కాదా అని ఈపీఎస్ ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్న డీఎంకేను 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటికి సాగనంపడమే లక్ష్యంగా అన్నాడీఎంకే పనిచేస్తుందని, ఇది జరగాలంటే ప్రజల్లో అవగాహన కల్పించేలా తమ ప్రచార వ్యూహం ఉంటుందన్నారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకులు ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రి జయలలిత రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు లబ్ధి పొందేలా పథకాలు ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోయారన్నారు. అన్నాడీఎంకేకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక డీఎంకే కూటమి పార్టీలు అన్నాడీఎంకేలో చీలికలు ఏర్పడేలా కుట్ర పన్నుతున్నాయని, అయినా పార్టీ రోజురోజుకు బలపడుతోందని ఈపీఎస్ పేర్కొన్నారు.

నీలగిరి జిల్లాలో భారీవర్షాలు

స్తంభించిన జనజీవనం

- చెట్టు కూలి ఒకరి మృతి



కొండ రైలు మార్గంలో పడిన బండరాయి

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్వత శ్రేణులు అధికంగా ఉన్న నీలగిరి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షాలకు జనజీవనం స్తంభించింది. శనివారం అర్ధరాత్రి కున్నూర్ ప్రాంతంలో ఈదురుగాలులకు చెట్టు కూలింది. రహదారుల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో కృష్ణాపురం సరస్సు సమీపంలో ఉన్న రోడ్డు ధ్వంసమైంది. మేల్‌భారత్‌నగర్ ప్రాంతంలో రోడ్డు పక్కన నిలిపిన కారుపై మట్టిపెళ్లలు విరిగి పడడంతో కారు కూడా ధ్వంసమైంది. కున్నూర్-మేట్టుపాళయం మధ్య జాతీయ రహదారిలో పలు ప్రాంతాల్లో మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. కున్నూర్ సమీపంలో రోడ్డుకడ్డంగా చెట్టు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం కూడా కురిసిన భారీ వర్షానికి కొండ రైలు సేవలు రద్దయ్యాయి. ఇక కున్నూర్ సమీపంలోని కుర్ణిహిల్ ప్రాంతంలో చెట్టు పడిన ఘటనలో జాకీర్‌హుస్సేన్ (43) సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సైనికులు, అగ్నిమాపక సిబ్బంది రంగంలో దిగి కూలిన చెట్లు, విరిగిపడిన మట్టిపెళ్లలను తొలగిస్తున్నారు. జిల్లాలో 24 గంటల్లో గరిష్ఠంగా కోతగిరిలో 143 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు స్థానికులు ఇళ్లకే పరిమితం కాగా, సెలవు రోజైన శని, ఆదివారాల్లో పర్యాటకుల సంఖ్య కూడా చాలావరకు తగ్గింది. కాగా, ఊటీ కొండ రైలు మార్గంలో బండరాళ్లు పడడంతో ఆదివారం కొండ రైలు సేవలు తాత్కాలికంగా రద్దుచేసినట్లు అధికారులు ప్రకటించారు.

ముదుమలైలో పులుల గణన ప్రారంభం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ముదుమలై పులుల శరణాలయంలో ప్రస్తుత ఏడాది పులుల గణన ప్రారంభమైంది. గణన కోసం అటవీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కూడలూరు సహా అన్ని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాల పరిధిలోని 150 ప్రాంతాల్లో ఆటోమేటిక్ కెమెరాలను శుక్రవారం నుంచి అమర్చుతున్నారు. పులులు వచ్చి, వెళ్లే మార్గాల్లోని నిర్దిష్ట ప్రాంతాల్లో 'ఎడమ', 'కుడి' వైపు రెండు కెమెరాలు అమర్చారు. నెలరోజులు వారానికి ఒకరోజు సర్వే నిర్వహిస్తారు. ఈ విషయమై ఓరకడవు ఫారెస్ట్ రేంజర్ ఫెలిక్స్ మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో పులుల గణన చేపట్టినందున ప్రజలు ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఆటోమేటిక్ కెమెరాల సమీపంలోకి వచ్చిన వారి ఫొటోలు కెమెరాలో నమోదవుతాయని, అందువల్ల కెమెరాల వద్ద ఎవరూ వెళ్లరాదని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఆటోమేటిక్ కెమెరాలు అమర్చుతున్న సిబ్బంది

సమాచార దృష్టి

కాశీ ఆధ్యాత్మిక యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామేశ్వరం నుంచి కాశీ ఆధ్యాత్మిక యాత్రకు 420 మందిని తీసుకెళ్లనున్న నేపథ్యంలో, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దేవాదాయ శాఖ పరిధిలోని 20 మండలాల్లో ఒక మండలానికి 21 మంది చొప్పున 420 మందిని ఉచితంగా యాత్రకు తీసుకెళ్లనున్నారు. ఆసక్తి కలిగిన వారు తమ మండల పరిధిలోని దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చు. అలాగే, దేవాదాయ శాఖ వెబ్‌సైట్ www.hrce.tn.gov.inలో కూడా దరఖాస్తు సమర్పించవచ్చు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులు డిసెంబరు 16వ తేదిలోపు పంపించాలి. మండల జాయింట్ కమిషనర్ల సిఫారసు మేరకు ఎంపికైన వారికి ఆధ్యాత్మిక యాత్రకు తీసుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

15 వరకు దివ్యాంగుల ప్రత్యేక శిబిరాలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు ఈ నెల 15వ తేది వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో.. ఉత్తర చెన్నై జిల్లా దివ్యాంగుల సంక్షేమ కార్యాలయం పరిధిలోని లబ్ధిదారులు స్టాన్లీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి, కీల్పాక్కం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి, కీల్పాక్కం మానసిక ఆస్పత్రి, ఎగ్మూర్ పిల్లల ఆస్పత్రి, ఎగ్మూర్ కంటి ఆస్పత్రుల్లో నిర్వహించనున్న ఈ శిబిరాల్లో, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరై ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు పొందవచ్చని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలియజేశారు.

విద్యుత్ సేవలపై జీఎస్టీ మినహాయింపు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పరికరాల తరలింపు సహా 26 రకాల సేవలను జీఎస్టీ నుంచి మినహాయిస్తున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. కొత్త విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు, అభివృద్ధి రుసుము వసూలుచేస్తుంటారు. అలాగే, ఇతర విద్యుత్ సేవలపై 18 శాతం జీఎస్టీ వసూలుచేస్తున్నారు. ఈ క్రమంలో, జీఎస్టీ కౌన్సిల్ సిఫారసు మేరకు 25 రకాల సేవలను జీఎస్టీ నుంచి మినహాయిస్తున్నట్లు విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

హిజ్రాల సంక్షేమ బోర్డులో సభ్యులు ఎంపిక

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిజ్రాల సంక్షేమ బోర్డును 2008లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ బోర్డు సభ్యుల పదవీకాలం మూడేళ్లుగా నిర్ణయించారు. ఈ క్రమంలో, బోర్డులో ఇద్దరు కొత్త అనధికార సభ్యుల ఎంపికకు ఆసక్తి కలిగిన వారు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో తమ వివరాలతో కూడిన దరఖాస్తులు సమర్పించాలని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

20 శాతం పెరిగిన బస్‌పాస్ విక్రయాలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంటీసీ) స్టూడెంట్, నెలవారీ పాస్‌లు విక్రయిస్తోంది. అలాగే, రూ.1,000 బస్ పాస్ కూడా ఇస్తోంది. ఈ పాస్ పొందిన వారు ఏసీ బస్సులు మినహా లగ్జరీ, డీలక్స్, సాధరణ బస్సుల్లో నెలరోజులు ప్రయాణించవచ్చు. కరోనాకు ముందు సుమారు 1.50 లక్షల రూ.1,000 పాస్‌లు విక్రయమవుతుండగా, కరోనా కారణంగా బస్సు సేవలు స్తంభించడంతో ఈ పాస్‌లు వినియోగించే వారి సంఖ్య 60,000 తగ్గింది. ఈ నేపథ్యంలో, గత నెలలో రూ.1,000 పాస్ విక్రయాలు 20 శాతం అధికంగా 95వేలకు చేరుకున్నాయని ఎంటీసీ అధికారులు తెలిపారు.

ఆర్ట్ ఫెస్టివల్‌కు విద్యార్థులకు ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతి పాసరై 40వ వార్షికోత్సవం సందర్భంగా, భారతి నెహ్రూ ఆర్ట్ ఫెస్టివల్ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. మాంగాడులోని తేరడి ఎల్లప్ప చెట్టియార్ కల్యాణ మండపంలో ఈ పోటీలు జరుగనున్నాయి. 1-5వ తరగతి విద్యార్థులు భారతీయార్, భారతీదాసన్, కవిమణి, నామక్కల్ కవీంజర్ పాటలపై 3 నిమిషాలు సంగీత పోటీల్లో పాల్గొనవచ్చు. 6-8 తరగతుల విద్యార్థులకు 'వరద ప్రభావం-వర్షపు నీటి సంరక్షణ' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు, 9-10 తరగతుల వారికి 'భారత దేశం మహాశక్తి' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. 11,12 తరగతులకు 'ప్రపంచ పోరును అడ్డుకుందాం' అనే అంశంపై కవితా పోటీలు ఉంటాయి. ఆసక్తి కలిగిన విద్యాసంస్థలు పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడు సంతకంతో కూడిన పోస్టు ద్వారా 'ఎంకే రమణన్, సెక్రటరీ, భారతీ పాసరై, 39/13, విలేజ్ రోడ్డు, సోమసుందరం నగర్, 4వ వీధి, తిరువొత్తియూర్, చెన్నై-19' చిరునామకు ఈ నెల 25వ తేదిలోగా పంపించాలి. వివరాలకు 9444182153, 9444298396 అనే నెంబర్లలో సంప్రదించవచ్చు.

రేపటి నుంచి గ్రాండ్ మాస్టర్ చెస్ టోర్నీ

● డిప్యూటీ సీఎం ఉదయనిధి

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నగరంలో గ్రాండ్ మాస్టర్ చెస్ టోర్నమెంట్ జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. ఇదే విషయంపై ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ప్రాంగణంలో ఈ టోర్నీ జరుగుతుందన్నారు. ఇందులో మాస్టర్స్, ఛాలెంజర్స్ విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ టోర్నీని ప్రత్యక్షంగా తిలకించాలనుకునే వారు బుక్‌మై షో లేదా యాప్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని, ఒక టిక్కెట్ ధర రూ.100గా నిర్ణయించినట్లు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

పింక్ సర్వీసులుగా డీలక్స్ బస్సులు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న డీలక్స్ బస్సులు (రెడ్ బస్సులు) ఇక నుంచి 'పింక్' బస్సులుగా నడుపనున్నారు. ఈ విషయమై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) అధికారి మాట్లాడుతూ... సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సదుపాయం 2021 మే నుంచి పరిచయం చేశారన్నారు. ఆ ప్రకారం, నగరంలో నడుపుతున్న 1,559 సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ బస్సులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సు ముందు, వెనుక పింక్ కలర్ వేసామన్నారు. ప్రస్తుతం సాధారణ బస్సులు మరమ్మతులు, కాలపరిమితి చెందడంతో వాటి స్థానంలో 200 డీలక్స్ బస్సులను పింక్ బస్సులుగా నడుపనున్నామని తెలిపారు. ఇప్పటికే లో ఫ్లోర్ డీలక్స్ బస్సులను సాధారణ బస్సులుగా నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

పొలాల్లో సంచరిస్తున్న ఒంటె



పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపం విల్లిసేరి ప్రాంతంలోని పొలాల్లో ఒంటె మేత మేయడం గ్రామస్తులు గుర్తించారు. ఈ ప్రాంతంలో ఒంటె సంచరించడం ఇదే తొలిసారి కావడంతో పిల్లలు, యువకులు దాని వెంటపడడంతో అది సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. ఈ విషయమై గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కానీ, క్రూరమృగాల జాబితాలో ఒంటె లేని కారణంగా అది ప్రజలకు ఎలాంటి హాని చేయదని అధికారులు తెలిపారు. కాగా, సర్కస్ బృందం నుంచి ఒంటె తప్పించుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఆదివారం ఉదయం కూడా గ్రామ పొలాల్లో ఒంటె సంచరించడం కనిపించింది.

ఉచిత యోగా తరగతులు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో నంగనల్లూర్, వేళచ్చేరి, సూరపేటలో నాలుగు వారాలు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నారు. నంగనల్లూర్ లక్ష్మీనగర్ మెయిన్ రోడ్డులోని సుదర్శన్ టెర్రస్ హాలులో ఈ నెల 11వ తేది శిక్షణ ప్రారంభం కానుంది. వేళచ్చేరిలోని తిరువీధి అమ్మన్ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 12, సూరపేట అంబత్తూర్ పుళల్ రోడ్డులోని అరుళ్‌జ్యోతి అరుణాలయంలో ఈ నెల 13 నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఉదయం 5.30 నుంచి 5 గంటల వరకు (సోమవారం నుంచి శనివారం వరకు) జరిగే ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యేందుకు ఆసక్తి ఉన్న వారు 9841227709 (నంగనల్లూర్), 8754499334 (వేళచ్చేరి), 9841150877 (సూరపేట) నెంబర్లు సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

శిరస్త్రాణంపై వినూత్న ప్రచారం


సరకులు అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇళయరాజా

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతున్న వారిని అభినందించిన ట్రాఫిక్ పోలీసులు, వారిలో 20 మందికి నిత్యావసర సరకులు అందజేశారు. కళ్లకుర్చి జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించడం, రోడ్డు ప్రమాదాల్లో మరణాలు అడ్డుకొనేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. అలాగే, ద్విచక్రవాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కళ్లకుర్చి నాలుగు రోడ్ల జంక్షన్‌లో శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో హెల్మెట్ పెట్టుకున్న ద్విచక్రవాహనదారులను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇళయరాజా అభినందించడంతో పాటు 20 మందికి రూ.500 విలువైన నిత్యావసర సరుకులు ఉచితగా అందజేశారు.

సంప్రదాయ వీధి జాతర


మహిళా వేషధారణలో యువకుడు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా నల్లాన్‌పిళ్లై గ్రామంలో సంప్రదాయ కళా ఉత్సవంలో భాగంగా నిర్వహించిన వీధి జాతరలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఏడాది దీపావళి తర్వాత రోజు గ్రామంలో యువకులు వీధి జాతర నిర్వహిస్తుంటారు. మంత్ర, తంత్రాలతో ఉన్న గ్రామస్తులను కాపాడేలా ఓ యువతి చేసిన సాహస కార్యాలతో కూడిన కథతో ఈ జాతర చేపడుతుంటారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ జాతరలో గ్రామానికి చెందిన యువకులు, ఉపాధ్యాయులు వివిధ వేషధారణతో జాతరలో పాల్గొన్నారు.

కేరళ రైలు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో రైలు ఢీకొని రాష్ట్రానికి చెందిన నలుగురు మృతిచెందడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సేలం జిల్లాకు చెందిన లక్ష్మణన్ (55), వల్లి (45), కారైక్కాడు టి.పెరుమాళ్‌పాళయానికి చెందిన లక్ష్మణన్ (45), అల్లికుట్టై గ్రామానికి చెందిన రాజమ్మాళ్ (43)లు రైల్వే శాఖలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు శనివారం మధ్యాహ్నం కేరళ రాష్ట్రం భారతపుళ రైల్వే వంతెనపై శుభ్రం చేస్తున్న సమయంలో ఢిల్లీ నుంచి తిరువనంతపురం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొని నలుగురు ఘటనా స్థలంలోనే మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలపడంతో పాటు వారి కుటుంబాలకు తలా రూ.3 లక్షలు ఆర్థికసాయం అందజేయాలని ఉత్తర్వులు జారీచేసినట్లు సచివాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

దేశవ్యాప్తంగా టోల్‌గేట్లు తొలగించాలి

● డీఎంకే ఎంపీ విల్సన్

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న టోల్‌గేట్లను తొలగించాల్సిందిగా డీఎంకే రాజ్యసభ సభ్యుడు, న్యాయవాది విల్సన్ డిమాండ్ చేశారు. ఆయన తన ఎక్స్ పేజీలో... రాష్ట్రంలో ప్రస్తుతం 64 టోల్‌గేట్లు జాతీయ రహదారుల కమిషన్ కింద పనిచేస్తున్నాయని, వీటిలో నిబంధనలు అతిక్రమించి వాహనచోదకుల నుంచి అధికంగా వసూలుచేస్తున్నారని ఆరోపించారు. చెంగల్పట్టు జిల్లా భరనూరు టోల్ గేట్‌లో 2008 పన్ను నిబంధన చట్టం 6కు వ్యతిరేకంగా 60 శాతం తగ్గించాల్సి ఉందని అయితే, జాతీయ రహదారుల కమిషన్ ఇప్పుడు కూడా పెంచిన పన్నునే వసూలుచేస్తోందని ఆరోపించారు. ఈ టోల్‌ప్లాజాకు కేటాయించిన పెట్టుబడి కంటే రూ.23.54 కోట్లు అదనంగా ఆదాయం రాబట్టుకుందని, దీనిపై రాజ్యసభలో తాను ప్రస్తావించినా కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు. వాహనచోదకులపై అధిక ఆర్థిక భారం మోపుతున్న టోల్‌ప్లాజాలను దేశ వ్యాప్తంగా తొలగించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం అన్ని పార్టీలు ఏకం కావాలని విల్సన్ పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఎంపాక్స్ ప్రభావం లేదు: మంత్రి ఎం.సుబ్రమణ్యం

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపాక్స్ ప్రభావం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... షార్జా నుంచి ఈ నెల 31న తిరుచ్చి వచ్చిన యువకుడికి ఎంపాక్స్ లక్షణాలున్నాయన్న సందేహంతో తిరుచ్చి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించామన్నారు. అతని రక్తనమూనాలు స్థానిక కింగ్ ఇన్‌స్టిట్యూట్, పూనేలోని ల్యాబ్‌కు తరలించామన్నారు. కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫలితాలు, కేంద్ర ఆరోగ్యశాఖ విడుదల చేసిన ఎంపాక్స్ లక్షణాలతో పోల్చగా, ఆ యువకుడికి ఎంపాక్స్ లక్షణాలు లేవని నిర్ధారణ అయిందని మంత్రి తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో అదనంగా 32 వేల సీట్లు

● అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలల్లో అదనంగా 32,000 సీట్లకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతులిచ్చింది. జాతీయ స్థాయిలో ప్రస్తుతం వైద్య విద్యకు పెరిగిన డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థుల్లో ఆసక్తి సన్నగిల్లింది. గత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 54,000పైగా సీట్లు భర్తీకాకపోవడం గమనార్హం. వివిధ కళాశాలల్లో కనీసవసతులు కల్పించకపోవడం ప్రధాన కారణమని విద్యావేత్తలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల కాలంలో కంప్యూటర్ సైన్స్, సమాచార సాంకేతిక ఇంజనీరింగ్ కోర్సుల అవసరం గణనీయంగా పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర విద్యా సంస్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో అదనపు సీట్లు కేటాయిస్తూ అనుమతిచ్చింది. దీని ప్రకారం, రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరంలో 3,08,686కు సీట్లు పెరుగుతుంది.

జలాశయాల్లో 73 శాతం నీటి నిల్వలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, జలాశయాల్లో 72.85 శాతం నీటినిల్వలున్నాయి. ఈశాన్య రుతుపవనాల కారణంగా పలు జిల్లాల్లో భారీవర్షాలు, మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో చెన్నై, తిరుచ్చి, కోవై, మదురై తదితర నీటిపారుదల శాఖ మండలాల పరిధిలో ఉన్న 90 ఆనకట్టలు, జలాశయాల పూర్తి సామర్థ్యం 2,24,297 మిలియన్ ఘనపుటడుగులు కాగా, శనివారం గణాంకాల ప్రకారం 1,63,411 మిలియన్ ఘనపుటడుగుల నీటినిల్వలున్నాయి.గత పదిరోజుల్లో నీటి నిల్వలు 14 శాతం పెరిగాయి.

1,211 చెరువుల్లో చేరని నీరు... : రాష్ట్రంలోని 38 జిల్లాల్లో మొత్తం 14,139 చెరువులున్నాయి. శనివారం గణాంకాల ప్రకారం 1,810 చెరువులు నిండాయి. 2,380 చెరువుల్లో 76 నుండి 99 శాతం, 2,312 చెరువుల్లో 51 నుండి 75 శాతం, 2,427 చెరుడుల్లో 26 నుంచి 50 శాతం, 3,999 చెరువుల్లో 1 నుంచి 25 శాతం నీటినిల్వలున్నాయి. అదే సమయంలో 1,211 చెరువుల్లో చుక్క నీరు కూడా లేదని అధికారులు తెలిపారు.

వాకీటాకీ లాక్కెళ్లిన ఇద్దరి అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడిలో పారిశుధ్య కార్మికుడి వాకీటాకీ లాక్కెళ్లిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యాసర్పాడి ముల్లై నగర్‌కు చెందిన శివలింగం చెన్నై కార్పొరేషన్‌లో తాత్కాలిక పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శివలింగం శనివారం ఉదయం డా.నటేశన్ రోడ్డు మసీదు సమీపంలో విధుల్లో ఉండగా, ఆ సమయంలో కొందరు యువకులు మూడు ద్విచక్రవాహనాల్లో వస్తూ, శివలింగం వినియోగించే బ్యాటరీ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆ యువకులు శివలింగంతో ఘర్షణకు దిగి అతనిపై దాడిచేసి, అతడి వాకీటాకీ లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై సూపర్‌వైజర్ సెల్వగణపతి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన రాయపేట పోలీసులు విచారణ చేపట్టి, ట్రిప్లికేన్ రోటరీ నగర్‌కు చెందిన రాజేష్ కుమార్, వ్యాసర్పాడి గాంధీపురానికి చెందిన ఏదీష్ లను అరెస్ట్ చేసి, వారి నుంచి వాకీటాకీ స్వాధీనం చేసుకొని, ఇద్దర్నీ కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

7 నుంచి పాఠశాలల్లో కళా ఉత్సవాలు

పెరంబూర్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళా ఉత్సవాలు ఈ నెల 7 నుంచి నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు కళా ఉత్సవాలకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఆ ప్రకారం, 1 నుంచి ప్లస్ టూ విద్యార్థులకు ఈనెల 7వతేది కళా పోటీలు నిర్వహించి, విజేతల వివరాలు 8వ తేది 'ఎమిస్' వెబ్‌సైట్‌లో నమోదుచేయాలి.తాలూకాస్థాయిలో ఒక్కో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 11 నుంచి 20వ తేది వరకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించాలి. ఈ పోటీ విజేతల వివరాలు 21న ఎమిస్ వెబ్‌సైట్‌లో నమోదుచేయాలి. జిల్లా స్థాయిలో ఒక్కో పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విజేతలు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించాలి. జిల్లా స్థాయి పోటీలు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు వేర్వేరుగా నిర్వహించాలి. జిల్లా స్థాయిపోటీలకువిద్యార్థులకు తీసుకెళ్లేందుకు ఒక ఉపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయురాలిని నియమించాలి.పోటీలనిర్వహణకు తాలూకా స్థాయిలో రూ.25వేలు, జిల్లాస్థాయి పోటీలకు రూ.లక్ష కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని అన్ని మహిళా పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ ఆదేశించారు. జిల్లాలో చెంగల్పట్టు, మేల్‌మరువత్తూర్, మహాబలిపురం తదితర ప్రాంతాల్లోని మహి ళా పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే, తాంబరం పోలీసు సరిహద్దు పరిధిలోని పలు మహిళా పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు లేవు. ఈ క్రమంలో జిల్లాలో నేరాల అదుపుపై ఇటీవల పోలీసు అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. లైంగిక, వరకట్న వేధింపులు, కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసేందుకు మహిళా పోలీస్‌స్టేషన్లకు మహిళలు అధికంగా వస్తుంటారు. వారికి భద్రత, కేసుల వి చారణ తదితరాల పర్యవేక్షణకు అన్ని మహి ళా పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

వ్యాసర్పాడి: కాసా గ్రాండ్, రిలయన్స్, అన్నపూర్ణ నగర్, వీబీసీ నగర్, దేవకి నగర్, ప్రకాష్ నగర్, తనికాచలం నగర్-ఇ బ్లాక్, ఎఫ్ బ్లాక్, గౌరి నగర్, బాలకృష్ణా నగర్, అయ్యప్పన్ నగర్, పరశురామ్ నగర్, లక్ష్మీ నగర్, తనిగై నగర్, వసంతం నగర్, కామాక్షి నగర్, విద్య నగర్, నటేశన్ నగర్, తిరుమలై నగర్, జీఎన్‌టీ రోడ్డు, జ్ఞానపతి గార్డన్, వీజీపీ సంతోష్ నగర్, కామాక్షియమ్మన్ నగర్, కందన్ నగర్, శ్రీనివాస నగర్, కర్మగం నగర్, బృందావన్ గార్డన్, బీపీ రోడ్డు, పెరియార్ రోడ్డు, నేతాజీ వీధి, పటేల్ రోడ్డు, అయర్ గార్డన్, వాసుదేవన్ గార్డన్, మెరిడియన్ హాస్పిటల్, రిలయన్స్ సూపర్ మార్కెట్, విజయా పార్క్, ఏరికరై, ఉమయాల్ కల్యాణ మండపం, సీఎండీఏ పూర్తి ప్రాంతం, నటరాజ్ నగర్ 1 నుండి 5 వీధులు, ఆర్‌ఆర్ నగర్, షణ్ముగసుందరం నగర్, 200 అడుగుల రోడ్డు, గురురాఘవేంద్ర నగర్, కన్నియమ్మాళ్ నగర్, వడపెరుంబాక్కం, వేదాచలం నగర్, చెల్లియమ్మన్ నగర్, సామువేల్ నగర్, బాలాజి నగర్, కందస్వామి నగర్, తనికాచలం నగర్, తిరుమలై నగర్, వీఎస్ మణి నగర్, కృష్ణా నగర్, సరస్వతి నగర్, చిన్నతోపు, రంగా కో ఆపరేటివ్ నగర్, డీజీ స్వామి నగర్, సుమంగళి నగర్, వినాయకపురం, లోటస్ కాలని, సామి నగర్.

అర్ధరాత్రి ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు శనివారం అర్ధరాత్రి బాంబు బెదిరింపు రావటంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విమానాశ్రయం డైరెక్టర్ కార్యాలయానికి గుర్తు తెలియని దుండగులెవరో ఈమెయిల్ ద్వారా విమానాశ్రయంలో బాంబులున్నాయని, కాసేపట్లో పేలనున్నాయని బెదిరించారు. ఈ విషయాన్ని అధికారులు భద్రతా విధుల్లో ఉన్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి తెలిపారు. దీంతో బాంబ్‌స్క్వాడ్, అగ్నిమాపక దళం ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు ఆదివారం వేకువజాము వరకు కొనసాగాయి. విమానాలన్నింటినీ తనిఖీ చేసిన తరువాతే పంపారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదరింపేనని నిర్ధారించారు. గత మూడు రోజులుగా ఈమెయిల్ ద్వారా ఎలాంటి బాంబులు రాక విమానాశ్రయ సిబ్బంది ప్రశాంతంగా విధులు నిర్వహించారు. ఆలోగా మళ్లీ ఈమెయిల్ ద్వారా బాంబు బెదరింపు రావటంతో అధికారులు విస్తుపోయారు.

దోపిడీకి వచ్చి బావిలో పడిన దొంగ

● సాయం చేసిన హౌస్ ఓనర్

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా కాంగేశం సమీపంలోని ఓ రైతు శుక్రవారం రాత్రి ఇంటి తలుపులు వేసి ముందు వరండాలో నిద్రపోయాడు. కుక్క మొరుగుతున్న శబ్ధం విని లేచిన ఆయ. ఇంటి తలుపులు పగులగొట్టి ఓ దొంగ ప్రవేశించడం గమనించాడు. వెంటనే అతను 'దొంగ..దొంగ' అని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. వారిని చూసిన దొంగ బయటకు పరుగులు తీశాడు. గ్రామం, శివారు ప్రాంతాల్లో గాలించినా దొంగ జాడ లేకపోవడంతో అందరూ ఇంటి ముఖం పట్టారు. శనివారం ఉదయం ఆ రైతు తన ఇంటి సమీపంలోని బావి నుంచి శబ్దం రావడం గమనించి అక్కడకు వెళ్లి చూడగా ఓ వ్యక్తి అందులో పడి ఉండడం గమనించాడు. తన ఇంట్లో దొంగతనానికి వచ్చిన వ్యక్తి అతనేనని గ్రహించిన రైతు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకొని బావిలో నుంచి దొంగను బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను నామక్కల్ జిల్లాకు చెందిన శక్తివేలు అని, చికిత్స తరువాత అతడిని కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

బస్సు నుండి ఊడిన డీజిల్ ట్యాంక్


ఊడిపడిన డీజిల్ ట్యాంక్

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే నుంచి కోవలం వెళ్తున్న ఎంటీసీ బస్సు నుంచి డీజిల్ ట్యాంక్ ఊడిపడిన ఘటన కలకలం రేపింది. బ్రాడ్‌వే బస్టాండ్ నుంచి శనివారం 40 మంది ప్రయాణికులతో కోవలం బయల్దేరిన ఎంటీసీ బస్సు మెరీనా సమీపం నొచ్చికుప్పం సర్వీసులో రోడ్డులో వెళ్తున్న సమయంలో హఠాత్తుగా డీజిల్ ట్యాంక్ ఊడిపడింది. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సు ఆపి, ప్రయాణకులను కిందకు దింపేశారు. అనంతరం బస్సును సమీపంలోని డిపోకు తరలించారు. కాగా, ఎంటీసీ నడుపుతున్న బస్సుల్లో శిథిలావస్థకు చేరుకున్నాయని, కిటికీ అద్దాలు, సీట్లు ఊడిపోతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కాగా, బస్సు నుంచి డీజిల్ ట్యాంక్ ఊడిపడిన ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎంటీసీ అధికారి ఒకరు తెలిపారు.

పసికందును విక్రయించారంటూ ఫిర్యాదు

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లో 50 రోజుల పసికందు విక్రయించారంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ మేరకు భాను, రాధామణి, రేవతి, సెల్వి సహా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పసికందును, నాగర్‌కోయిల్‌కు చెందిన దంపతులకు రూ.4 లక్షలకు విక్రయించారనే ఫిర్యాదుపై వీరప్పన్‌సత్రం పోలీసులు విచారణ చేపట్టారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి దుర్మరణం

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో ఆదివారం ఒకేరోజు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. ఎన్నూర్ ఎక్స్‌ప్రెస్ హైవే సహా వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగాయి. మనలి ఎంఎఫ్ఎల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహమ్మద్ అలి మృతిచెందాడు. అలాగే, ద్విచక్రవాహనాన్ని ట్యాంకర్ లారీ ఢీకొన్న ఘటనలో వినోద్ అనే యువకుడు మృతిచెందగా, మరో రెండు ప్రాంతాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటనపై ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కోయంబేడు మార్కెట్‌లో రౌడీల పరార్

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్ ప్రాంగణంలో రాత్రివేళల్లో తిష్టవేసే రౌడీలు, నేరస్తుల గుండెల్లో పోలీసులు రైళ్ళు పరుగెత్తించారు. డిప్యూటీ కమిషనర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో శనివారం రాత్రి ఈ మార్కెట్ ప్రాంతంలో వందమందికిపైగా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మార్కెట్ భవనాలపై (టెర్రస్) దాగివున్న రౌడీలు, వివిధ కేసుల్లో సంబంధం ఉన్న నేరస్తులు, మాదకద్రవ్యాలను విక్రయించే వారు పోలీసులను చూడగానే పారిపోయారు. కొందరిని అదుపులోకి తీసుకుని హెచ్చరించి వదిలేశారు. పోలీసుల చర్యను కోయంబేడు మార్కెట్ వ్యాపారులు స్వాగతించారు.

13న తిరువారూరు జిల్లాకు సెలవు

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా ముత్తుపేట సమీపంలోని జాంబవాడలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన షేక్ దావూద్ దర్గా వార్షిక ఉరుసు ఉత్సవం 14 రోజులు జరుగనుంది. ఈ వేడుకల్లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశముంది. ఈ సందర్భంగా ఈ నెల 13న తిరువారూరు జిల్లాకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సెలవు రోజుకు బదులు డిసెంబరు 7వ తేది పనిదినంగా కలెక్టర్ ప్రకటించారు.

పేడ చల్లుకొనే వినూత్న ఉత్సవం


పేడ చల్లుకుంటున్న యువకులు

వేళచ్చేరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం తాళవాడి కొండ ప్రాంతంలో గుండాపురం గ్రామం ఉంది. గ్రామంలోని బీరేశ్వరర్ ఆలయ ఉత్సవాలను ప్రతి ఏటా గ్రామస్తులు జరుపుకుంటారు. వేడుకల్లో భాగంగా యువకులు ఒకరిపై ఒకరు పేడ చల్లుకొనే వినూత్న కార్యక్రమం నిర్వహిస్తుంటారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ సమీపంలో ఉన్న పేడలో సుమారు 50 మంది యువకులు దిగి, ఒకరిపై ఒకరు పేడ చల్లుకున్నారు. ఈ వేడుకల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువకులు కూడా పాల్గొనడం విశేషం.

22న అధర్వ నటించిన 'నిరంగల్ మూండ్రు'

'మారన్' ఫేం కార్తీక్ నరేన్ దర్శకత్వంలో అధర్వ హీరోగా నటించిన తాజా చిత్రం 'నిరంగల్ మూండ్రు'. ఈ నెల 22న విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇందులో అధర్వతో పాటు శరత్ కుమార్, రెహమాన్, అమ్ము అభిరామి కీలక పాత్రలు పోషించారు. హైపర్‌లింక్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందించిన ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. ఈ సినిమా ట్రైలర్ ఇప్పటికే విడుదల చేయగా, ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది. ఇపుడు ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. నిజానికి ఈ సినిమాను ఎపుడో విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని సమస్యల కారణంగా విడుదల కాలేదు. ఇపుడు ఈ సమస్యలన్నీ పరిష్కారం కావడంతో రిలీజ్ తేదీ ప్రకటించారు. ఐంగారన్ ఇంటర్నేషనల్ బ్యానరుపై తెరకెక్కింది. కాగా అధర్వ ప్రస్తుతం 'డీఎన్ఏ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే.


'నిరంగల్ మూండ్రు'లో రెహమాన్, అధర్వ, శరత్ కుమార్

మాధవన్ హీరోగా 'అదృష్టశాలి'

కెరీర్ ఆరంభంలో చాక్లెట్ బాయ్‌గా తమిళం, తెలుగు ఇండస్ట్రీల్లో గుర్తింపు పొంది, తమిళ చిత్రపరిశ్రమలో భిన్నమైన కథలను ఎంచుకుంటూ తన సినీ కెరీర్ కొనసాగిస్తున్న కోలీవుడ్ హీరో మాధవన్ 'అదృష్టశాలి'గా ప్రేక్షకుల ముందుకురానున్నారు. 'యారడి నీ మోహిని', 'తిరుచిత్రాంబలం' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన మిత్రన్ ఆర్.జవహర్ ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఫాంటసీ డ్రామా కోణంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని ఏప మీడియా కార్పొరేషన్ బ్యానరుపై షర్మిల, రేఖా విక్కి, మనోజ్ ముల్కి సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ కూడా స్కాట్లాండ్‌లో పూర్తిచేశారు. మాధవన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో మడోన్నా సెబాస్టియన్, రాధిక, సాయి తన్షిక, జగన్, నిరూప్ ఎన్‌కే, ఉపాసన ఆర్‌సీ, మ్యాథ్యూ వర్గీస్, ఉదయ్ మహేశ్, కేఎస్‌జీ వెంకటేష్, రవిప్రకాష్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించే ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

చిత్రజ్యోతి




అదితి శంకర్

అదితి శంకర్ హోమ్లీ క్లిక్స్...

ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ కుమార్తెగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన అదితి శంకర్... వరుసగా సినిమా అవకాశాలను దక్కించుకుంటోంది. 2022లో వచ్చిన 'విరుమన్' చిత్రంలో హీరో కార్తీ సరసన నటించిన ఆమె.. తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించారు. వైద్య వృత్తి పూర్తి చేసిన అదితి .. కేవలం నటిగానే కాకుండా, గాయనిగా కూడా ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. తాను నటించిన తొలి చిత్రంలోనే మంచి మార్కులు వేయించుకోవడంతో పాటు ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారు. 2023లో శివకార్తికేయన్ నటించిన 'మావీరన్'లో నటించారు. ప్రస్తుతం విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన 'నేసిప్పాయ' అనే చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా హోమ్లీ క్లిక్స్ పేరుతో నిర్వహించిన స్పెషల్ ఫొటో షూట్‌కు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి ఇపుడు వైరల్ అయ్యాయి.



ఒకేసారి మూడు చిత్రాల్లో ధనుష్

ఒకవైపు హీరోగా, మరోవైపు దర్శకుడిగా, ఇంకోవైపు నిర్మాతగా రాణిస్తున్న హీరో ధనుష్.. ఒకేసారి మూడు చిత్రాల్లో నటించేందుకు అంగీకరించారు. వీటిలో తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించే 'కుబేర' మూవీ కూడా ఉంది. ఇది దాదాపుగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇసైజ్ఞాని ఇళయరాజా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందే 'ఇళయరాజా' బయోపిక్‌లో నటిస్తున్నారు. దానితో పాటు 'పోర్‌తొళిల్', 'లబ్బర్ పందు' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన యువ దర్శకుడు విఘ్నేష్ రాజా (పోర్‌తొళిల్), తమిళరసన్ పచ్చముత్తు (లబ్బర్‌పందు) దర్శకత్వంలో నటించేందుకు ధనుష్ సమ్మతం తెలిపారు. దీంతో ధనుష్ వరుసగా మూడు చిత్రాల్లో నటించేలా తన షెడ్యూల్ ప్లాన్ చేసుకుంటున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. మరోవైపు, తాను దర్శకత్వం వహించే చిత్రాలకు కూడా ఎలాంటి ఆటంకం లేకుండా ఆయన హీరోగా నటించనున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు భారత్ ఆదర్శం

● శృంగేరి మఠాధిపతి విదుశేఖర భారతి

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే సంస్కృతి, సంప్రదాయాలకు భారతదేశం ఆదర్శంగా ఉందని కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠాధిపతి జగద్గురు విదుశేఖర భారతి స్వామి పేర్కొన్నారు. విజయాత్రలో భాగంగా ఆదివారం జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)ను విదుశేఖర భారతి సందర్శించారు. బంగారు కవచంతో అలంకరించిన అమ్మవారి మూలవిరాట్టును దర్శించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోవులకు పూజ చేశారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ హాలులో స్వామిజీ అనుగ్రహభాషణం చేస్తూ... శంకరాచార్యులు దేశంలో నాలుగు ప్రదేశాల్లో శారదా పీఠాలు ఏర్పాటు చేశారని, వీటిలో దక్షిణ భారతంలో ఏర్పాటైన పీఠం కర్ణాటకలోని శృంగేరి అని వివరించారు. భక్తులందర్నీ అనుగ్రహించే వాసవాంబను సదా నిశ్చల భక్తితో ప్రార్థించాలని హితవు పలికారు. ఆలయాన్ని సంప్రదాయంగా నిర్వహిస్తూ సమాజానికి, ముఖ్యంగా విద్యకు పెద్దపీట వేస్తున్న ఎస్కేపీడీ సంస్థ నిర్వాహకుల సేవలను కొనియాడారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త కొల్లా వెంకటచంద్రశేఖర రావు, పాలక మండలి సభ్యులు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, సీఆర్ కిషోర్‌బాబు తదితరులు జగద్గురువును సత్కరించారు.


పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఎస్కేపీడీ సంస్థ నిర్వాహకులు

మురుగన్ ఆలయాల్లో స్కందషష్ఠి పారాయణం

● ప్రారంభించిన మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో స్కంధషష్ఠి పారాయణం కార్యక్రమానికి హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆదివారం శ్రీకారం చుట్టారు. తిరువాన్మియూర్‌లోని పాంబన్ కుమరన్ గురుదాస ఆలయంలో స్కంధషష్ఠి ఉత్సవాలను పురస్కరించుకొని కీల్పాక్కం ఏకంబరనాథర్ మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల, కొళత్తూర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థుల స్కంధషష్ఠి పారాయణం కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పాంబన్ గురుదాస ఆలయానికి మహా కుంభాభిషేకం నిర్వహించాలని 1988లో బాలాలయం పూర్తిచేసి సుమారు 36 ఏళ్ల అనంతరం న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది కుంభాభిషేకం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. దిండుగల్ జిల్లా పళనిలో జరిగిన ముత్తమిళ్ తమిళ మహానాడులో ఆమోదించిన తీర్మానాల్లో ఒకటైన స్కంధషష్ఠి ఉత్సవాల సందర్భంగా విద్యార్థులచే స్కంధ పారాయణం రాష్ట్రవ్యాప్తంగా సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 738 పాఠశాల, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. సోమవారం ప్యారీస్ కందస్వామి ఆలయం, 6న వడపళని మురుగన్ ఆలయం సహా మిగతా ఆలయాల్లో పారాయణం జరుగుతుందన్నారు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో కోలాహలంగా జరుగుతున్న స్కంధషష్ఠి ఉత్సవాల్లో భక్తులు పాల్గొంటున్నారని, వారి సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు.


తిరువాన్మియూర్‌లో స్కంధ షష్ఠి పారాయణంలో పాల్గొన్న విద్యార్థినులతో మంత్రి శేఖర్‌బాబు

సరికొత్త అందాలతో 'వళ్లువర్‌కోట్టం'

● సంక్రాంతి లోగా ప్రారంభం

పెరంబూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నిలిపేందుకు మల్టీ లెవల్ పార్కింగ్, 1,400 మంది కూర్చొనేలా ఆడిటోరియం, తిరుక్కురల్ పీపుల్స్ నాలెడ్జ్ సెంటర్ తదితర కొత్త హంగులతో రూ.80 కోట్లతో చేపట్టి పునరుద్ధరణ పనులు పూర్తి చేసుకొని వళ్లువర్‌కోట్టం సంక్రాంతికి ముందే ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుక్కురల్ రచించిన తిరువళ్లువర్ స్మారకార్థం నుంగంబాక్కంలో 5 ఎకరాల విస్తీర్ణంలో ద్రావిడ కళలు, పల్లవరాజుల శిల్పకళతో నిర్మించిన వళ్లువర్‌కోట్టం 1976 ఏప్రిల్ 15వ తేది అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి ప్రారంభించారు. 48 ఏళ్లు గడిచిన ఈ ప్రాంతం శిథిలావస్థకు చేరడంతో, వళ్లువర్‌కోట్టం సరికొత్త అంశాలతో పునరుద్ధరిస్తామని అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పునరుద్ధరణకు రూ.80 కోట్లు కేటాయించారు. ప్రజాపనుల శాఖ పర్యవేక్షణలో 275 మంది భవననిర్మాణాల నిపుణులు, ఇంజనీర్లు, కార్మికులు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. 1,400 మంది కూర్చొనేలా ఏసీ ఆడిటోరియం, తిరుక్కురల్ మండపం, తిరుక్కురల్ పద్యాలు ప్రదర్శించే పెయింటింగ్స్ ప్రవేశ ద్వారంలో మ్యూజికల్ ఫౌంటైన్, 1,000 పుస్తకాలతో లైబ్రరీ తదితరాలు ఈ కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటుకానున్నాయి. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఫుట్‌పాత్, రథం పైకి ర్యాంప్ తదితరాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పెయింటింగ్ జరుగుతోందని, పనులు సకాలంలో పూర్తిచేసి సంక్రాంతిలోపు ప్రజల సందర్శనానికి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.


పునరుద్ధరించబడిన వళ్లువర్‌కోట్టం నమూనా


జీవిత సాఫల్య పురస్కార గ్రహీతలు

పలువురు ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాలు

అడయార్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రొవోక్ ఆర్ట్ ఫెస్టివల్ 2024 జరిగింది. ఇందులో ప్రతియేటా ప్రదానం చేసే జీవిత సాఫల్య పురస్కారాలను పలువురు ప్రముఖులకు అందజేశారు. ఈ అవార్డులను అందుకున్న వారిలో పద్మశ్రీ చిత్ర విశ్వేశ్వరన్, పద్మశ్రీ భద్రప్పన్, కలైమామణి ఢిల్లీ గణేష్, కలైమామణి కేఎన్ రామస్వామి, కలైమామణి రాజ్‌కుమార్ భారతి, కలైయం ఎస్ఎస్ కలైరాణి తదితరులున్నారు. ఆళ్వార్‌పేటలోని మ్యూజిక్ అకాడెమీలో ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, మాజీ డీజీపీ జాంగిడ్, చెన్నై సూపర్ కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథన్, శ్యామ్‌పాల్, అశ్విని శ్యామ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరతనాట్య కళాకారిణి పద్మశ్రీ శోభనా చంద్రకుమార్, కర్ణాటక సంగీత కళాకారుడు అభిషేక్ రఘురాం తదితరులు చేసిన ప్రదర్శన ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.

శ్రీవిల్లిపుత్తూరులో ట్రెక్కింగ్ ప్రారంభం

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పర్వతారోహణ పథకం ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఆ మేరకు శ్రీవిల్లిపుత్తూరు - మేఘమలై పులుల అభయారణ్యం ప్రాంతానికి, సెన్బగతోప్పు - వ.పుదుపట్టి మధ్యనున్న 9 కి.మీ పర్వత ప్రాంతంపై ట్రెక్కింగ్ ప్రారంభమైంది. ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో ప్రజలను ఆ పర్వతమార్గంలో ట్రెక్కింగ్‌కు అనుమతిస్తున్నట్లు శ్రీవిల్లిపుత్తూరు - మేఘమలై పులుల అభయారణ్య కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజ్ ప్రకటించారు. అక్టోబర్ 24న ఈ పర్వతారోహణ పథకానికి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి లాంఛనంగా పర్వాతారోహకులకు కిట్లు పంపిణీ చేసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం అమలుకుగాను రాష్ట్ర అటవీ శాఖ సిబ్బంది, గిరిజన యువకులను గైడ్లుగా నియమించి వారికి అన్ని సదుపాయాలు కల్పించారు. వీరి వెంట సాయుధలైన అటవీ సిబ్బంది రక్షణగా వెళ్లేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఆ ప్రకారం శ్రీవిల్లిపుత్తూరు పడమటి కనుమలకు చేరువగా ఉన్న శెన్బగతోప్పు నుండి వ. పుదుపట్టి వరకు ఉన్న 9 కిలోమీటర్ల వరకు ఈ పర్వతారోహణ ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఈ మార్గంలో జిల్లా కలెక్టర్ జయశీలన్ నేతృత్వంలో అధికారులు ఇదివరకే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆదివారం ఉదయం యువకులు జట్లుగా ఏర్పడి ట్రెక్కింగ్ జరిపారు. శెన్బగతోప్పు నుండి వ. పుదుపట్టి దాకా ట్రెక్కింగ్ చేయడానికి ఒక్కో వ్యక్తికి రూ.2,299 రుసుముగా నిర్ణయించారు. ఈ ట్రెక్కింగ్‌కు వెళ్లాలనుకేవారు www.trektamilnadu.com అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని శ్రీవిల్లిపుత్తూరు - మేఘమలై పులుల అభయారణ్య కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజ్ తెలిపారు.


ట్రెక్కింగ్ చేస్తున్న వారికి రక్షణగా వెళ్తున్న అటవీ సిబ్బంది


వాగు దాటుతున్న యువకులు



అన్నా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టాప్రదానం చేసిన గవర్నర్ (ఫైల్‌ఫొటో)

సకాలంలో 19 వర్సిటీల స్నాతకోత్సవాలు

● గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా 19 విశ్వవిద్యాలయాలకు తాను సకాలంలో స్నాతకోత్సవాలు నిర్వహించినట్లు గవర్నర్ ఆర్ఎన్ రవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. విద్యార్థుల ఉన్నత చదువులకు ఎలాంటి అవరోధం ఉండకూడదని ఆకాంక్షిస్తూ అక్టోబరు నెలాఖరువరకూ చాన్సలర్ హోదాలో 19 విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో పాల్గొని విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశామని గవర్నర్ తెలిపారు. సెప్టెంబర్ 9న కోవైలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొన్నానని, ఆ తరువాత వరుసగా విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో పాల్గొని 7918 మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా, 8,20,072 మంది విద్యార్థులకు పరోక్షంగాను పట్టాలు ప్రదానం చేసినట్లు గవర్నర్ వివరించారు. ఈ 19 విశ్వవిద్యాలయాలకు సంబంధించి మొత్త 8,27,990 మంది విద్యార్థులు తన చేతుల మీదుగా పట్టాలు స్వీకరించారన్నారు. చెన్నైలోని వెటర్నరీ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 20 జరిపేందుకు విశ్వవిద్యాలయం పాలకమండలి నిర్ణయించిందని, ఆ స్నాతకోత్సవంలో తాను పాల్గొన్ని విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నట్లు గవర్నర్ రవి తెలిపారు. వచ్చే యేడా ది నుంచి స్నాతకోత్సవాలను ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరు నెలల్లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని విశ్వవిద్యాలయాల వీసీలకు తాను ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

పండుగ సీజన్‌లో గ్రామాలకు ప్రత్యేక బస్సులు

● మంత్రి శివశంకర్


ప్యారీస్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లి తిరిగొచ్చే ప్రజల కోసం మారుమూల గ్రామాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ పేర్కొన్నారు. దీపావళి వరుస సెలవుల్లో నడుపుతున్న ప్రత్యేక బస్సుల గురించి మంత్రి శివశంకర్ మదురైలో శనివారం అర్ధరాత్రి పరిశీలించారు. అక్కడ నుంచి చెన్నై సహా పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా నడుపుతున్న ప్రత్యేక బస్సుల వివరాలను మాట్టుదావని బస్ స్టేషన్ అధికారుల వద్ద మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మదురై డివిజన్ రిజర్వేషన్ కౌంటర్ పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... దీపావళి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లి తిరుగు ప్రయాణం చేపట్టిన ప్రజల కోసం పట్టణాల నుంచి గ్రామాల వరకు 12,846 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపామన్నారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఒకేరోజు 75 వేల మందికి పైగా రిజర్వేషన్ చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ రవాణా సంస్థలు గత నెల 28 నుంచి 30వ తేది వరకు నడిపిన ప్రత్యేక బస్సుల్లో 5.76 లక్షల మందికి పైగా ప్రయాణం చేశారని మంత్రి తెలిపారు.


శనివారం అర్ధరాత్రి మదురై బస్‌స్టేషన్ పరిశీలిస్తున్న మంత్రి శివశంకర్

ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో జరుగనున్న 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పాల్గొనేందుకు బయలుదేరిన స్పీకర్ అప్పావుకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద వీడ్కోలు పలుకుతున్న అసెంబ్లీ కార్యదర్శి కే శీనివాసన్, సచివాలయ అధికారులు



తిరుపతి చిత్రకారుడికి ప్రథమ బహుమతి





ముక్తేశ్వర్ ఆలయ చిత్రం వేసిన చిత్రకారుడు చిరంజీవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలులో ఆదివారం జరిగిన ఆర్ట్ ఫెస్ట్‌లో తిరుపతి చిత్రకారుడు చిరంజీవికి ప్రథమ బహుమతి దక్కింది. పెయింటింగ్‌లో జాతీయ స్థాయి అవార్డులు, ప్రపంచ రికార్డులు సాధించిన రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వంద మంది ప్రముఖ ఆర్టిస్టులు ఆర్ట్ ఫెస్ట్‌లో పాల్గొన్నట్టు నిర్వాహకుడు శేషబ్రహ్మం తెలిపారు. 'ప్రాచీన భారత్' అంశం మీద చిత్రకారులు కాన్వాస్ పెయింటింగ్స్ ప్రదర్శన చేశారు. అందులో ముక్తేశ్వర్ ఆలయ పెయింటింగ్‌కు గాను తిరుపతి చిత్రకారుడు చిరంజీవికి ప్రథమ బహుమతి వచ్చిందని, అందుకుగాను రూ10,116 నగదు బహుమతి, చిత్రకళా భారతి పురస్కారాన్ని అందజేసినట్టు చెప్పారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,849మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,171మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,529మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 919, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 286మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 228మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 68మంది భక్తులు దోషనివారణ పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,673 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.


- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నటనలోనూ ఆయన రైట్‌రైట్..

● వృత్తి,ప్రవృత్తుల్లో రాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్ మల్లికార్జున

నటించిన ప్రతి పాత్రకూ ప్రాణం పోయడం ఆయన ప్రత్యేకత. అందుకే వందకు పైగా పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించగలిగారు. నాటకరంగంలో ఔరా అనిపించుకుంటున్న ఆయన పేరు బుంగ మల్లికార్జున. చంద్రగిరి మండలం సానంబట్ల గ్రామానికి చెందిన ఈయన నాలుగు దశాబ్దాలుగా పాత్రోచితంగా నటిస్తూ అందరి మన్ననలందుకుంటున్నారు.











చంద్రమోహన్ నుంచి అందుకుంటున్న అవార్డు



తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు చిన్నప్పుడే ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలు ప్రేరణగా నిలిచాయని చెప్పే మల్లికార్జున 1983లో బాలసుబ్రహ్మణ్యం వద్ద నటనలో శిక్షణ పొందారు. తొలిసారిగా ఎస్వీయూలో 'ఊహాజీవులు'లో కవి పాత్రతో నాటకరంగంలో ప్రవేశించారు. 'మంచంమ్మీదమనిషి' నాటకంలో వైద్యుడి పాత్ర అవకాశం వచ్చింది. తర్వాత వెనకతిరగకుండా నాటకాల్లో నిలదొక్కుకున్నారు. డిగ్రీ పూర్తయ్యాక 1988లో ఆర్టీసీ కండక్టర్‌గా చేరారు. ఉద్యోగం చేస్తూనే నాటకరంగంలో వివిధ అవకాశాలను అందిపుచ్చుకుని ప్రేక్షకుల మన్ననలకు పాత్రులయ్యారు. 1994లో 'భక్తమార్కండేయ' వీధినాటంలో 'యముడు' పాత్ర అద్భుతంగా పోషించారు. జానపద గురువు ప్రకాష్‌రాజు, పౌరాణిక గురువు సుందరబాబుల శిష్యుడిగా ఇరవై ఏళ్లగా విభిన్న పాత్రలతో రాణించారు. శ్రీనివాసకల్యాణం నాటకంలో మహావిష్ణువు, వరాహమూర్తిగా ద్విపాత్రాభినయం చేసేవారు. ఇప్పటి వరకు మల్లికార్జున వందకు పైగా పాత్రలు ధరించారు. దాదాపు 250 నాటకాల్లో పాలుపంచుకున్నారు.



కేంద్రమంత్రి చేతులమీదుగా మహాత్మగాంధీ అవార్డు



ఆర్టీసీ ఈడీ నుంచి అభినందనలు అందుకున్న మల్లికార్జున

ప్రేక్షకాదరణే అవార్డుగా..

మా గ్రామంలో పదిమంది నటులను తయారుచేశాను. వచ్చే ఏడాది రిటైర్ అవుతున్నా. తర్వాత పూర్తిసమయం నాటకాలకు వెచ్చిస్తాను. ఊపిరి ఉన్నంత వరక నాటకాలు వేస్తుంటాను.పెద్ద అవార్డులు రాలేదని బాధపడేవాడినికాను. ప్రేక్షకుల చప్పట్లే ప్రోత్సాహాన్నిచ్చేవి.

-మల్లికార్జున

వందకుపైగా అవార్డులు: కళామతల్లి పుత్రుడిగా మల్లికార్జున 25కి పైగా పురస్కారాలు అందుకున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో కేంద్రమంత్రి మహమ్మద్‌ఖాన్ చేతులుమీదుగా మహాత్మగాంధీ ఎక్సలెన్స్ అవార్డు తీసుకున్నప్పుడు మధురానుభూతి కలిగిందంటారు మల్లికార్జున. వివిధ రాష్ట్రాల్లో రెండుసార్లు రాష్ట్ర ఉత్తమనటుడు, అభినయ గాన గంధర్వ లాంటి పలు విశిష్ట పురస్కారాలు అందుకున్నారు.

సివిల్ సర్వీస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జట్లను ఎంపిక చేసినట్లు డీఎస్‌డీఈవో సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 29, 30 తేదీలలో తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారు ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలిలా...

● క్రికెట్ : ఎస్.వెంకటేశ్వర్(కలెక్టర్), కె.ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.లోకేశ్, కె.సురేష్, జి.పురుషోత్తం, ఎం.సురేష్, వి.తుకారాం, ఎస్.రమేష్‌నాయక్, మన్నెయ్య ●అథ్లెటిక్స్ : టి.యువజరాజ్, ఎం.సిసింద్రి, కె.శివకుమార్, బి.గిరిబాబు, ఎన్.పవన్‌కుమార్, ఎస్.కె.జావిద్, ఐ.మణెయ్య, ఎస్.వి.సుబ్బయ్య, వి.తుకారాం, ఎ.చంద్రబాబు, కె.సురేష్, డి.పవన్‌కుమార్, సి.రెడ్డెమ్మ, పి.ప్రియాంక, పి.కుమారి. ●హాకీ : ఎం.ప్రసన్నలక్ష్మి, ఎస్.జ్యోత్స్న, ఎల్.భార్గవి, పి.ప్రియాంక, పి.వరప్రసాద్. ●కబడ్డీ : ఎన్.హేమనాథరాజ్‌కుమార్, ఎ.భారతి, ఎస్.అజరుద్దీన్, వి.హరిప్రసాద్. ●పవర్‌లిఫ్టింగ్ : ఎం.వెంకటేష్, ఎ.సాయిప్రదీప్, ఎస్.కె.జావిద్ ●స్విమ్మింగ్ : ఎస్.చంద్రబాబు, ఎస్.కె.జావిద్ ●టెన్నిస్ : ఎస్.శ్రీరాఘవ, ఎస్.రమేష్‌నాయక్ ●టేబుల్ టెన్నిస్ : రెడ్డిప్రసాద్, సుకుమార్, వి.కిరణ్, ఎల్.భార్గవి, ఎం.ప్రసన్నలక్ష్మి ●వాలీబాల్ : ఎన్.సాయికౌషిక్, ఎస్.మణిగండ, ఎం.సురేష్, డి.పవన్‌కుమార్, ఎన్.పవన్‌కుమార్, కె.ప్రసన్న, పి.కుమారి ●కుస్తీ : ఎం.హేమంత్‌కుమార్, ఎం.వేణు, ఎ.సాయిప్రదీప్, ఎస్.దర్శిని ●వెయిట్ లిఫ్టింగ్ : ఎ.కె.జావిద్ ●ఖోఖో : డి.పవన్‌కుమార్, ఎన్.ప్రవీణ్‌కుమార్, కె.సెల్వరాజ్, పి.ప్రియాంక ● బెస్ట్‌ఫిజిక్ : ఎం.వెంకటేష్, ఎస్.కె.జావిద్ ●యోగా : ఎ.సుబ్రహ్మణ్యం, ఎన్.మంజుల, జె.పుష్పలత, కె.వేదవతి, ఎం.సందీప్ ●క్యారమ్స్ : వి.శ్రీనివాసులు, ఎస్.లక్ష్మీకాంత్, ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.రమేష్‌నాయక్, సుకుమార్, ఎం.సందీప్, ఎన్.మంజుల, జె.పుష్పలత ●చదరంగం : ఎం.నరేంద్రనాథచౌదరి, బి.గిరిబాబు, ఎం.సందీప్, ఎన్.మంజుల, జె.పుష్పలత ●ఫుట్‌బాల్ : ఎం.నవీన్‌కుమార్, వినోద్‌కుమార్ ●బ్యాడ్మింటన్ : శశిభూషణ్‌రావు, కె.వి.నాగేంద్ర, పి.కల్యాణ్, కె.గోపీనాథ్, ఎస్.ప్రసాద్, అబ్దుల్ అజీజ్, కె.వేదవల్లి, సి.రెడ్డెమ్మ.

రూ.30కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

● రహస్యంగా గదుల నిర్మాణం
● తిరుపతి రూరల్ టీడీపీ నేత నిర్వాకం



కబ్జా స్థలంలో నిర్మించిన గదులు



కాలువపై ఏర్పాటు చేసిన రోడ్డు

తిరుపతి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర శివారు ప్రాంతాల్లో భూమి విలువ ఆకాశాన్నంటుతుండడంతో భూ బకాసురుల కన్ను అటువైపు పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన కబ్జాల పర్వం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. కాలువ పోరంబోకు, ప్రభుత్వ భూములను అన్వేషించి రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమించేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలు, సర్వే నెంబరు 114లో దాదాపు రూ.30కోట్లు విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. మంగళం-శెట్టిపల్లె 80 అడుగుల ప్రధాన రహదారికి పడమర దిశగా తిమ్మనాయుడుపాళెం, మంగళం చెరువుల నుంచి వచ్చే కాలువకు ఎగువన ఈ భూమిపై కన్నేసిన టీడీపీ తిరుపతి రూరల్ మండల నేత రాత్రికి రాత్రే చదును చేసి, వరుస క్రమంలో మూడు గదులను నిర్మించేశాడు. మరిన్ని నిర్మించడానికి మెటీరియల్ సిద్ధం చేసుకున్నాడు. వాహనాల రాకపోకలకు అనువుగా కాలువపై సిమెంట్ పైపులు పరిచి రోడ్డు సైతం ఏర్పాటు చేసుకున్నారు. కాలువ పోరంబోకులో గతంలో నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో విరమించుకున్నారు. ఈ ప్రాంతం జనసంచారానికి కాస్త దూరంగా ఉండడంతో యథేచ్ఛగా నిర్మాణాలు చేసేస్తున్నారు. చుట్టుపక్కల మండలాల్లో రెవెన్యూ భూములకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా ఇక్కడ మాత్రం కానరాలేదు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి

● రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్

రేణిగుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తామని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చెప్పారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలో జరిగే 'ఆన్ ది స్పాట్ స్టడీ టూర్' నిమిత్తం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం దూరంతో ఎక్స్‌ప్రెస్‌లో రమేష్ సారథ్యంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరికి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎం విజయకుమార్, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు తేజోవతి ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎం రమేష్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని తిరుపతి, రేణిగుంట, గుంతకల్లు, గూడూరు, విజయవాడ, విశాఖపట్టణంతో పాటు హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు, సదుపాయాలను కల్పించే దిశగా చేపట్టాల్సిన అంశాలపై రైల్వే అధికారులతో సోమవారం చర్చిస్తామన్నారు. అలాగే రైల్వేస్టేషన్ల తనిఖీ కూడా ఉంటుందన్నారు. అనంతరం బీజేపీ రేణిగుంట మండల బీజేపీ అధ్యక్షురాలు తేజోవతి సంత గేటు వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో స్టాండింగ్ కమిటీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

భీష్మయ్యనాయుడికి నేతల నివాళులు

● హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

చంద్రగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొబ్బా భీష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులను పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించారు. గత నెల 21వ తేదిన ఆయన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన స్వగ్రామమైన చంద్రగిరి మండలం శేషాపురంలో కర్మక్రియలు జరిగాయి. విజయ్ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ దాసరి జైరమేష్, తిరుపతి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్సీవీ నాయుడు, కిమ్స్ హాస్పిటల్ ఎండీ బొల్లినేని భాస్కర్ రావు, సినీ నటుడు రఘుబాబు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, గాలి రాజేంద్రనాయుడు, ఆర్సీపురం మాజీ జడ్పీటీసీ దేవానందనాయుడు, సుధాకర్‌చౌదరి, భూపాల్‌నాయుడు, కిమ్స్ హాస్పిటల్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీఎస్ నాయుడు, టీటీడీ మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వాసుదేవనాయుడు తదితరులు హాజరయ్యారు. భీష్మయ్యనాయుడు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు.



భీష్మయ్యనాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విజయ్ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ దాసరి జైరమేష్

భీష్మయ్యనాయుడు కుటుంబీకులను సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సినీనటుడు రఘుబాబు



వైసీపీ కౌన్సిలర్‌పై వీఆర్వో ఫిర్యాదు

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రాఘవయ్యపేట వీఆర్వో నీలిమ వైసీపీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ మునీంద్రబాబుపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల ఒకటో తేదీన 20వ వార్డు ఇసుకమిట్టలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సమయంలో తనను కౌన్సిలర్ అసభ్యంగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించాడని ఆమె పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టులు

● వ్యక్తిపై కేసు నమోదు

చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఆదివారం చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గూడూరు తూర్పువీధి ప్రాంతానికి చెందిన ఉన్నం వినీష్. టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ ఫొటోతో ఫేస్ బుక్ ద్వారా ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తూ, అసభ్యకర పదజాలంతో దూషించి ప్రచారం చేశారు. తానంకి నానాజీ అందుబాటులో లేకపోవడంతో ఆయన డ్రైవర్ నాగరాజు ఫిర్యాదు మేరకు వినీష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మినీలారీ - ఆటో ఢీ: ఒకరి మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్

తిరుచానూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు ఫ్లైఓవర్ మీద మినీలారీ- ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. తిరుచానూరు ఎస్‌ఐ అరుణ తెలిపిన వివరాలు మేరకు.. బీఎన్‌కండ్రిగ మండలం అలత్తూరుకు చెందిన మనోహర్(43) ఆటో నడుపుతుంటాడు. ఆదివారం తిరుచానూరు పద్మశాలి భవన్ వైపు నుంచి రాంగ్‌రూట్‌లో తాజ్ హోటల్ వెళ్లడానికి ఫ్లైఓవర్ ఎక్కాడు. అదే సమయంలో చంద్రగిరి నుంచి నాయుడుపేటకు వెళుతున్న మినీలారీ వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇతడు చనిపోయాడు. ప్రమాదం జరిగాక 108 వాహనం సకాలంలో రాలేదని అక్కడున్న వాహనచోదకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 88.076 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 36,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వైభవంగా తిరుమలనంబి శాత్తుమొర

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తుడైన తిరుమల నంబి శాత్తుమొర ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీవారి తీర్థకైంకర్యాన్ని తిరుమలనంబి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆదివారం శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న తిరుమలనంబి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామానుజాచార్యుల అంశతో జన్మించిన మనవాళ మహాముని శాత్తుమొర ఈనెల 6న జరుగనుంది. 9న అత్రి మహర్షి, పిళ్లైలోకాచార్య, పోయిగై ఆళ్వార్, శ్రీభూదత్తాళ్వార్ల తిరునక్షత్రోత్సవాలతో పాటు వేదాంత దేశికాచార్య శాత్తుమొర కూడా జరుగనుంది. 10న పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న యాజ్ఞవల్క్య జయంతి జరుగనున్నాయి. తిరుమల శ్రీవారికి ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, శ్రీవారి పరమ భక్తుల తిరు నక్షత్రోత్సవాలు కూడా టీటీడీ ఘనంగా నిర్వహించడం విశేషం.